

ఎన్‌టీపీసీకి అవార్డు

పరవాడ: పర్యావరణ పరిరక్షణలో ఎన్‌టీపీసీ సింహాద్రి యూనిట్‌కు అపెక్స్ ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది.



వివాదాల్లేకుండా సర్వే రాళ్లు

రీసర్వే పూర్తయిన భూముల్లో సర్వే రాళ్లు పాతే క్రమంలో లోటుపాట్లు తలెత్తరాదని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. 8లో



పేదలకు మెరుగైన వైద్యం


మంత్రి అమర్‌నాథ్ అనకాపల్లిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని మేయర్‌తో కలిసి ప్రారంభించారు. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (గురు) 6-16 సహర్ (శుక్రజు) 4-27
నర్సీపట్నం
6-20 4-26

ఆపదలో గుర్తొచ్చే ఆప్తుడు పోలీస్

- మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ఫోకస్
- సాంకేతికతతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ
- జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మరింత నిఘా
- సాక్షి ఇంటర్వ్యూలో కొత్త ఎస్పీ మురళీకృష్ణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, అనకాపల్లి: అన్ని వర్గాలవారు సుఖసంతోషాలతో ఉండేలా చూడాల్సిన బాధ్యత పోలీసుల పై ఉంది.. జిల్లాలో పట్టణ ప్రాంతంతోపాటు గ్రామీణ ప్రాంతాలు మిళితమై ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు తగ్గట్టుగా పోలీసింగ్ వ్యవస్థలో మార్పులు చేపడతాం. ప్రస్తుతం కాలంతోపాటు టెక్నాలజీ కూడా అందుబాటులోకి వచ్చింది. సాంకేతికతను ఉపయోగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నేరాలు తగ్గుముఖం పట్టేలా... చోరీలకు చెక్ పెట్టేలా కింది స్థాయి కానిస్టేబుల్ నుంచి సహచర పోలీస్ అధికారుల వరకు అందరి సహకారంతో తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తాను.. అని కొత్త ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. బుధవారం ఆయన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇస్తూ తన ప్రాధాన్యాలను వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

స్థానిక పరిస్థితులపై దృష్టి సారిస్తా..

ఇప్పటివరకు తిరుపతి, రాజమండ్రి వంటి నగరాల్లో విధులు నిర్వర్తించాను. అనకాపల్లి అభివృద్ధి చెందుతున్న పట్టణం. జిల్లా కేంద్రంగా ఎదుగుతోంది. స్థానిక పరిస్థితులను అర్థం చేసుకొని అనకాపల్లికి ఏం చేయాలో అవగాహన చేసుకుంటాను. ప్రతి మండలం, గ్రామ స్థితిగతులు, సమస్యాత్మక ప్రాంతాలు మొదలైన అంశాలన్నింటినీ వీలైనంత త్వరగా ఆకళింపు చేసుకొని.. పోలీస్ వ్యవస్థపై ప్రజలకు మరింత గౌరవం పెరిగేందుకు కృషి చేస్తాను.

చోరీలకు చెక్ పెట్టేలా..

అనకాపల్లి టౌన్‌తోపాటుగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో చోరీల నియంత్రణకు కృషి చేస్తాం. సెలవులకు ఊరెళ్లినప్పుడు, ఇతర కారణాల దృష్ట్యా ఇళ్లకు తాళాలు వేసినప్పుడే హౌస్ బ్రేకింగ్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయి. అలాంటి చోరీలు, దొంగతనాల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌసింగ్ మానిటరింగ్ సిస్టం)లను ఏర్పాటు చేస్తాం. పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే హౌస్ బ్రేకింగ్ చోరీలకు పూర్తిగా చెక్ పెట్టేందుకు కృషి చేస్తాం.

జిల్లా సరిహద్దుల్లో నిఘా

జిల్లా సరిహద్దుల నుంచి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. గంజాయి స్మగ్లర్ల చెర నుంచి యువతను కాపాడతాం. ఇప్పటికే కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్, సత్ప్రవర్తన కమిటీలతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థి స్థాయిలోనే మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా కేసుల్లో పడే శిక్షలపై ప్రత్యేకంగా అవగాహన కలిగించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. రానున్న విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు పెంచుతాం.

రోడ్డు ప్రమాదాలకు చెక్

హైవేలపై దాబాలు సమయం మించి తెరిచి ఉన్నా.. అందులోకి మద్యం అనుమతించినా.. ఆ సమీపంలో లారీలు, ఇతర వాహనాలు జాతీయ రహదారులపై నిలిపివేసినా చర్యలుంటాయి. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు ఉన్న దాబాల సమీపంలో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట విజిబుల్ పోలీసింగ్ పెంచుతాం. లంకెలపాలెం జంక్షన్ లాంటి పెద్ద ట్రాఫిక్ కూడలిలో వీలైనంత మేరకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని పెంచుతాం.

గ్రామ స్థాయిలో పోలీస్ సేవలు విస్తృతం



సచివాలయ మహిళా పోలీసుల సేవలను ఉపయోగించుకుంటాం. ఎస్‌హెచ్‌వో పర్యవేక్షణలో గ్రామాల్లో పోలీస్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకొస్తాం. స్పందనలో విన్నవించుకొనే ప్రతి సమస్యను గ్రామ స్థాయిలోనే సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది సహకారంతో పరిష్కరిస్తాం. సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తాం. వారి పరిధిలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు సంబంధిత ఎస్‌హెచ్‌ఓతో పాటు ఒక ఉన్నతాధికారి కూడా ఆ గ్రూపులో ఉండేలా ఏర్పాటు చేస్తాం. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలపై సచివాలయ మహిళా పోలీసుల పర్యవేక్షణలో స్పందనలో ఫిర్యాదు చేసుకునేలా ఏర్పాటు చేస్తాం. శాంతిభద్రతల సమస్య ఉన్న ప్రతి పౌరుడు సంబంధిత స్పందనలో ఫిర్యాదు చేసుకోవచ్చు. దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్ ద్వారా మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తాం.

స్పందన తలుపులు తెరిచే ఉంటాయి

జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. వారి కోసం పోలీస్ 'స్పందన' తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయ్. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఎప్పుడైనా వచ్చి ప్రజలు తమ ఫిర్యాదుల్ని స్పందన సెల్‌లో అందించవచ్చు. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడితే 24 గంటల్లో ఏ వేళలో అయినా ప్రజలు పోలీస్‌స్టేషన్ తలుపులు తట్టవచ్చు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం.

నిబద్ధత గల అధికారి జేసీ కల్పన

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అభినందన
- బదిలీపై వెళుతున్న అధికారికి ఘన సత్కారం



జేసీ కల్పనాకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, రెవెన్యూ అధికారులు

తుమ్మపాల: జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఎంతో నిబద్ధత గల అధికారి అని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అభినందించారు. సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వెళ్తున్న ఆమెను కలెక్టరేట్‌లో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన జిల్లాగా అనకాపల్లి ఏర్పడిన రోజున తనతో పాటు ఆమె జేసీగా వచ్చారని, జిల్లాలో అనేక కష్టతరమైన పనులను సైతం సులభంగా పరిష్కరించగలిగారన్నారు. ఆమె కృషి మూలంగానే రీసర్వే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మద్యపానం మానిపించేందుకు విముక్తి స్వాభిమాన్ కార్యక్రమం అమలుకు ఆమె ఎంతో చొరవ చూపించారన్నారు. జేసీ కల్పనాకుమారి మాట్లాడుతూ నూతన జిల్లా అనకాపల్లిలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. గ్రామీణ జిల్లాలో ఎన్నో వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయని, వాటి పర్యటనల్లో అనేక కొత్త విషయాలను తెలుసుకున్నానన్నారు. డీఆర్వో పి.వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎస్‌డీసీ అనిత, డ్వామా పీడీ సందీప్, ఆర్ఎస్‌ఏ అధ్యక్షుడు రత్నం, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ విధుల పట్ల ఆమె సూక్ష్మదృష్టిని, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, సీపీవో రామారావు, డీపీవో శిరీష, మత్స్యశాఖ డీడీ లక్ష్మణరావు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్‌డీసీలు రమామణి, జ్ఞానవేణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నూకాంబిక హుండీ ఆదాయం రూ.44.59 లక్షలు



అమ్మవారి హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో బుధవారం అమ్మవారి హుండీ లెక్కించారు. గత నెల 16వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు 28 రోజులకు 44 లక్షల 59 వేల 63 రూపాయల నగదు, సింగపూర్ డాలర్లు 2, 17 గ్రాముల బంగారం, వెండి కేజీ 700 గ్రాములు సమకూరిందని దేవదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత పేర్కొన్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, జిల్లా దేవదాయ శాఖాధికారి ఎస్.రాజారావు, పట్టణ పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వహణ లోపాలుంటే చర్యలు



ఎం.కోటపాడు అంగన్‌వాడీలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి

మాడుగుల : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, ఐసీడీఎస్ ప్రాంతీయ ఉప సంచాలకులు చిన్మయిదేవి అన్నారు. మండలంలోని ఎం.కోటపాడు అంగన్‌వాడీ కేంద్రం-2ను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తాగునీటి వసతి, పోషణ ట్రాకర్‌లో లబ్ధిదారుల వివరాలు, ప్రీ స్కూల్ పిల్లలు, మధ్యాహ్న భోజనం, స్టాక్ రికార్డులు పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టులో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి శ్రీదేవి, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



పార్వతీబాయి (ఫైల్)

అనకాపల్లి టౌన్: స్థానిక గాంధీనగరానికి చెందిన పిప్పళ్ల పార్వతీబాయి (96) మరణానంతరం నేత్రదానం చేశారు. ఆమె మంగళవారం మృతి చెందారు. నేత్రాలు దానం చేస్తానని ఆమె ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు గతంలో లేఖ రాశారు. కుమారుడు పిప్పళ్ల సత్యం సమాచారం ఇవ్వడంతో ఐ బ్యాంకు వారు వచ్చి మృతురాలి కళ్లను సేకరించారు.

హంసినికి సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు



హంసినిని అభినందిస్తున్న సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి

పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏడో తరగతి చదువుతున్న ఎం.హంసిని సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు ఎంపికైంది. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించిన 11వ నేషనల్ ఒలింపియాడ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుకు ఎంపికైందని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ తెలిపారు. ఈ నెల 16న హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు తీసుకోనుందని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తాలకు ఆర్థిక భరోసా



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- జిల్లాలో 4,864 మందికి రూ.7.29 కోట్ల లబ్ధి
- నమూనా చెక్కు అందజేసిన కలెక్టర్

నర్సీపట్నం: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల మహిళలకు రెండో విడత ఈబీసీ నేస్తం నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నర్సీపట్నంలో బుధవారం నిర్వహించారు. దీనికి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి హాజరయ్యారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులను విడుదల చేసిన కార్యక్రమాన్ని లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. ఈ పథకంలో భాగంగా ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున జిల్లాలో 4,864 మందికి రూ.7.29 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, ఆర్డీవో హెచ్.వి.జయరాం, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జి.పెంటోజీరావు, బీసీ సంక్షేమశాఖ డీడీ కె.రాజేశ్వరి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయ మాధవి, అమ్మాజీ తదితర్లు పాల్గొన్నారు.

• థాంక్యూ జగనన్నా..



ఈబీసీ నేస్తం నగదు విడుదల సందర్భంగా బుధవారం తామరం సచివాలయం వద్ద సీఎం జగన్ ఫ్లెక్సీకి లబ్ధిదారులు పాలాభిషేకం నిర్వహించారు. వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, ఉప సర్పంచ్ ప్రసాద్, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పాల్గొన్నారు. -మాకవరపాలెం

గురుకులాల్లో ప్రవేశాలకు 16న ప్రవేశ పరీక్ష

సింహాచలం: మహాత్మా జ్యోతీబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు గాను ఈనెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు సింహాచలంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. mjpapbcwreis.apcfss.in నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

విద్యా కానుక పంపిణీకి పక్కా ఏర్పాట్లు

- సెలవుల అనంతరం అందజేత
- సమగ్ర శిక్ష రాష్ట్ర సహాయ సంచాలకుడు నాంచారయ్య



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర సహాయ సంచాలకుడు నాంచారయ్య

దేవరాపల్లి: ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం విద్యా కానుక కిట్లను అందజేసేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని సమగ్ర శిక్ష రాష్ట్ర సహాయ సంచాలకులు జి.నాంచారయ్య తెలిపారు. కాశీపురం హైస్కూల్‌లో విద్యా కానుక కిట్లను భద్రపరిచే గదిని స్థానిక మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబుతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం దేవరాపల్లిలోని ఎంఈవో కార్యాలయంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఏడు రకాల సామగ్రి ఉండే ఈ కిట్లను పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది ప్రత్యేక పరిశీలకులను ప్రభుత్వం నియమించిందన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు గడువు పెంపు

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 20తో ముగియనున్న గడువును పెంచనున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర సహాయ సంచాలకుడు నాంచారయ్య తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో 2133 బోధన, బోధనేతర ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి కోరామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌లో విద్యాభ్యాసం చేస్తున్న బాలికల కోసం రాష్ట్రంలో 145 కేజీబీవీ ప్రత్యేక హాస్టల్స్‌ను తెరిచామని, ఈ ఏడాది మరో 16 హాస్టల్స్‌ను తెరుస్తామన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి సిహెచ్. రవీంద్రబాబు, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 టీడీపీ కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సమక్షంలో చేరిక
- పార్టీలకు అతీతంగా అందిస్తున్న పథకాలకు ఆకర్షితులమయ్యామని వెల్లడి

చీడికాడ: ఎల్.బి.పట్నానికి చెందిన టీడీపీ నేతలు గండి తాతబాబు, బండారు నారాయణమూర్తి సహా 50 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ బి.వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో తారువలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన టీడీపీ నేతలు గండి తాతబాబు, బండారు నారాయణమూర్తి మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పథకాల మంజూరుకు ముక్కుపిండి లంచాలు వసూలు చేసేవారని ప్రస్తుతం వివక్షకు, లంచాలకు తావు లేకుండా అర్హులందరికీ నేరుగా పథకాలు అందిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంలో గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా విప్లవాత్మక పాలన సాగిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కురచా సత్యనారాయణ, బండారు పైడినాయుడు, రొంగలి తాతంనాయుడు, పోతల తాతంనాయుడు, మల్లేటి వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబం అయినా పింఛన్ మంజూరు



మాది టీడీపీ కుటుంబం. అయినా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడి దయతో నా భర్తకు పింఛన్ మంజూరైంది. టీడీపీ కార్యకర్తలమైనా ఆ ప్రభుత్వ హయాంలో పెన్షన్ రాలేదు. జగన్ బాబు దయ వల్ల ఎటువంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. అందుకే ఆయన వెంట నడవాలని పార్టీలో చేరాం.

-బండారు నారాయణమ్మ, ఎల్.బి.పట్నం

ఎన్నాళ్లో వేచిన ఉదయం..

- డీఎస్సీ- 98 నియామకాల జోరు
- 355 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోట పోస్టింగ్



కౌన్సెలింగ్ అనంతరం బాండ్ పేపరును డీఈవోకు అందజేస్తున్న అభ్యర్థి



డీఈవో కార్యాలయానికి తరలివచ్చిన అభ్యర్థులు

విశాఖ విద్య: డీఎస్సీ-98లో ఎంపికైన అభ్యర్థుల కల నెరవేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కోరిక తీరింది. పారదర్శకంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కోరుకున్న పాఠశాలలో పని చేసే అవకాశం లభించింది. డీఈవో కార్యాలయ అధికారులు వారికి నియామక పత్రం అందించిన వేళ.. సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఇచ్చిన మాట మేరకు కొలువులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జై కొట్టారు. 25 ఏళ్ల ఎదురు చూపులకు మోక్షం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ-98లో ఎంపికైన ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన అభ్యర్థులకు బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు 355 మందిని అర్హులుగా తేల్చి, తొలి రోజు జాబితాలోని 1 నుంచి 200 మంది వరకు కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, డీఈవో చంద్రకళ, అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో ఒక్కో అభ్యర్థిని పిలిచి కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఖాళీల జాబితాను ముందుగానే ప్రకటించారు. 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యమిచ్చి ఖాళీల జాబితాను సిద్ధం చేశారు. దీంతో దాదాపుగా అందరికీ తమ నివాస ప్రాంతాలకు సమీప మండలాల్లోనే పోస్టింగ్‌లు లభించాయి. మిగిలిన వారికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.


ఇన్నాళ్లకు అవకాశం దక్కింది



డీఎస్సీలో అర్హత సాధించినా.. ప్రభుత్వ ఉద్యోగం దక్కలేదనే బాధ ఉండిపోయింది. ఇన్నాళ్లకు టీచర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. ఇంకో ఆరేళ్లకు పైగానే ఉద్యోగం చేస్తాను. ఇంట్లో పిల్లలకు పాఠాలు చెప్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్దుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వ బడిలో పిల్లల అభివృద్ధికి పాటుపడతాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్లే మాకు ఉద్యోగాలు వచ్చాయి. అందుకే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– పి.లక్ష్మి, మధురవాడ, విశాఖ జిల్లా

పిల్లలకు పాఠాలు చెప్పడం ఇష్టం



గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పాలనాధికారిగా పనిచేస్తున్నాను. ఫ్యాక్టరీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేయాలనేది చిరకాల కోరిక. పిల్లలకు పాఠాలు చెప్పటం అంటే మహా ఇష్టం. ఇన్నాళ్లకు ఆ కల నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్లే ఇది సాధ్యమైంది.

– పి.వెంకట రమణమూర్తి, గోవాడ, అనకాపల్లి జిల్లా

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



డీఎస్సీ-98లో ఎంపికైన వారి గురించి పట్టించుకుని, ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. మా గురించి గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇంకా తొమ్మిదేళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తాను. మా మండలంలోనే పోస్టింగ్ వచ్చినందుకు మరింత ఆనందంగా ఉంది.

– దొండా చిన వెంకన్నదొర, వీరవిల్ల అగ్రహారం, అనకాపల్లి జిల్లా

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ ధ్యేయం

కోట్నివీధి పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధి కోట్నివీధిలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్, జీవీఎంసీ నిధులతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన, జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.1.10 కోట్లతో నిధులతో చేపట్టిన ఈ భవనం నిర్మాణం పూర్తయినా, ఎన్నికల కోడ్‌తో ప్రారంభం అలస్యమైందన్నారు. ఏడు సచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ ఆరోగ్యకేంద్రం ద్వారా వైద్య సేవలు పొందవచ్చన్నారు. 66 రకాల వైద్య పరీక్షలు, 101 రకాల మందులు, గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, ఈఎన్‌టీ స్పెషలిస్టుల్ని నియమించినట్టు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరి



కోట్నివీధి పీహెచ్‌సీలో నూతన బెడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

వెంకటకుమారి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు వైద్యం కోసం భారీ మొత్తంలో ఖర్చుపెట్టాల్సిన అగత్యం లేకుండా, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి పెద్ద పీట వేశారని కొనియాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నారని తెలిపారు. ఇకపై వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా పొందవచ్చన్నారు. జోన్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.95 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ వాహనాన్ని ప్రారంభించారు. నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10 లక్షలు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.



స్వీపింగ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ, మేయర్ గొలగాని

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు మాట్లాడుతూ విద్యా, వైద్యాన్ని సీఎం జగన్ ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తు పాలన సాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ 82, 83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, జోనల్ కమిషనర్ పి.వెంకట రమణ, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్లు రామ్మూర్తి, ఎ.వి.రత్నకుమారి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి ఉపకరించే ఆవిష్కరణలు చేయండి

విద్యార్థులకు ఆర్జేడీ శోభారాణి సూచన



త్రీడీ టెక్నాలజీని పరిశీలిస్తున్న ఆర్జేడీ

చోడవరం రూరల్: విద్యార్థి దశలో విద్యతోపాటు విలువలు నేర్చుకుని, అందుబాటులో ఉన్న సాంకేతికతతో మానవాళికి ఉపకరించే నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) ఎస్.శోభారాణి సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మూడు రోజుల ఆధునిక శాస్త్ర విజ్ఞాన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. కళాశాలలో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ, త్రీడీ ప్రింటింగ్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మెరుగైన శాస్త్ర సాంకేతిక పరికరాలను వినియోగించుకుని, అధ్యాపకుల సహకారంతో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు.

కళాశాల కార్యశాల(వర్క్‌షాప్) ముఖ్య నిర్వాహకుడు ప్రాసోల్ మైండ్స్ అధినేత ఫయాజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులను వినూత్న ప్రయోగాల వైపు దృష్టి మరల్చే విధంగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాలపై పట్టు సాధించాలని, అందుకు ఈ వర్క్‌షాప్ ఉపకరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్జేడీ ప్రశంసా పత్రాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు ఆర్జేడీ శోభారాణిని జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, కార్యదర్శులు టి.రాధాకృష్ణ, సీహెచ్ రాంబాబు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్‌ఎం రఫీయుద్దీన్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లేకుండా సర్వే రాళ్లు

- రైతుల సమక్షంలోనే సర్వే రాళ్ల ఏర్పాటు
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలు



సీతన్నఅగ్రహారంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

రావికమతం/రోలుగుంట/మాకవరపాలెం: రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో సర్వే రాళ్లు పాతే క్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావీయకుండా, రైతుల అభ్యంతరాలను పరిష్కరించి, వారి సమక్షంలోనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన రావికమతం, రోలుగుంట(చింతలపూడి), మాకవరపాలెం(సీతన్నఅగ్రహారం)లో రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్లు మహేశ్వరరావు(రావికమతం), వెంకటేశ్వరరావు(రోలుగుంట), ప్రసాదరావు(మాకవరపాలెం), రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీసర్వేలో



పెదపాచిల గ్రామంలో సర్వే చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

లోపాలు తలెత్తిన దృష్ట్యా మరోసారి సర్వే చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో సర్వే రాళ్లు పాతేటపుడు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. పాతిన రాళ్లను ఎవరైనా పీకేస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 43 గ్రామాల్లో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం ఈ నెలాఖరుకు గానీ, మే మొదటి వారానికి గానీ పూర్తవుతుందన్నారు. రావికమతం మండలంలో 14 గ్రామాల్లో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం పూర్తయిందని, ఇంకా 33 గ్రామాల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట సర్వేయర్లు అప్పారావు, సత్యనారాయణ, తవిటినాయుడు, ఆర్‌ఐ చిన్నబ్బాయి, సతీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలి

- లేకుంటే ఉద్యమం ఉధృతం
- ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీజేఏసీ అమరావతి పిలుపు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇవ్వాల్సిన వివిధ రకాల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు వంటి హామీలను నెరవేర్చాలన్నారు. నాలుగు సంవత్సరాలపాటు ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరించామని, కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర డిఫరెంట్లీ ఎబుల్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, క్లాస్ 4 ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఏపీ వీఆర్వోస్ అసోసియేషన్ కార్యదర్శి సాంబశివరావు, ఏపీసీపీఎస్‌ఏ అధ్యక్షుడు అప్పలరాజు, లేబర్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకరరావు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గడువులోగా ప్రభుత్వ భవనాలు పూర్తిచేయాలి

పీఆర్ ఇంజనీర్లతో డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశించారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ సభ్యులైన డీఈఈలు, ఏఈలు తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయనను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికార్లతో మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టిసారించాలన్నారు. నిర్మాణ పనుల్లో రాజీపడకుండా, నాణ్యత ప్రమాణాలను



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును అభినందిస్తున్న పీఆర్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు

పాటించాలన్నారు. అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిందన్నారు. తను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో సాధించిన పురోగతిని ప్రజలకు తెలిసేలా చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పీఆర్ ఇంజినీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, డీఈఈ జి.ఎస్.ఎస్.ప్రసాద్, కార్యదర్శి ఎల్.సత్యన్నారాయణ, విశాఖ జిల్లా అధ్యక్షులు, డీఈఈ జగదీష్‌బాబు, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు

తెలకల, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ల అభినందనలో విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరంకు చెందిన దూతి సత్తిబాబును రాష్ట్ర గాండ్ర, తెలకల కార్పొరేషన్ డైరెక్టర్‌గా, అత్తిలి జగన్‌మోహన్‌రావును రాష్ట్ర జంగమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఆయన తన కార్యాలయంలో వారికి అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ బీసీలకు అండగా సీఎం జగన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. నూతనంగా నియమితులైన డైరెక్టర్లు మాట్లాడుతూ పార్టీకి మొదటి చేస్తున్న సేవల్ని గుర్తించి తమను డైరెక్టర్లుగా నియమించిన సీఎం జగన్‌కు, విప్ ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసి, తమ



రాష్ట్ర తెలకల, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, పార్టీ నాయకులు

పదవులకు సముచిత గౌరవం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, బైన ఈశ్వరరావు, డీఆర్‌యూసీ మెంబర్ బొడ్డు శ్రీరామ్మూర్తి, గాండ్ర తెలకల సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రవికుమార్, కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ ప్రాణాలు కోల్పోయిందంటూ మృతురాలి బంధువులు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. సం



మృతురాలు నాగలక్ష్మి

ఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక సీఐ ఎల్.భాస్కర్ ఇరువర్గాలతో చర్చలు జరపడంతో, పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలిలోని నర్సింగపల్లి, పాలపుసోమవారం పేటకు చెందిన వై.నాగలక్ష్మి (25) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమె భర్త గోవింద్ అనకాపల్లిలోని ఓ ఆస్పత్రిలో ఆమెను చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకువెళ్లాలని వైద్యులు సూచించడంతో ఆమెను షీలానగర్‌లో కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చేర్చే సమయంలోనే ఆమె పరిస్థితి బాగా లేదని, న్యుమోనియా, రక్తహీనతతో ఉందని బంధువులకు తెలియజేశారు. గత శుక్రవారం నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి బుధవారం మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే నాగలక్ష్మి మృతి చెందిందంటూ ఆరోపించారు. అప్పటికే నాగలక్ష్మి వైద్యానికి రూ.1.80 లక్షలు చెల్లించామని, మరో రూ.2లక్షలు చెల్లించాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపారని మృతురాలి బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో గాజువాక సీఐ ఎల్.భాస్కర్, ఎస్‌ఐ కొల్లి సతీష్ మృతురాలి బంధువులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. మిగిలిన వైద్య ఖర్చులు ఉపసంహరించుకునేటట్లు సయోధ్య కుదరడంతో పరిస్థితి సద్దుమణిగింది. మృతురాలికి పాప, బాబు ఉన్నారని పోలీసులు తెలిపారు.



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న గాజువాక సీఐ భాస్కరరావు

గ్యాస్ స్టౌ నుంచి మంటలు

- దగ్ధమైన ఇంట్లో సామాగ్రి
- రూ. 2 లక్షల మేరకు అస్తి నష్టం జరిగినట్టు అంచనా



గ్యాస్ బండ నుంచి వ్యాపిస్తున్న మంటలు

నాతవరం: గ్యాస్ స్టౌ నుంచి మంటలు వ్యాపించి ఇల్లంతా దగ్ధం కావడంతో సుమారుగా రూ. 2 లక్షలు ఆస్తి నష్టం జరిగింది, మండలంలో మన్యపురట్లలో సిహెచ్.పాములమ్మ ఉదయం నుంచి బయట వృత్తి పనులు చేసుకోని ఇంటికి వచ్చి మధ్యాహ్న సమయంలో వంట చేయడానికి గ్యాస్ స్టౌ వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో భయంతో పాములమ్మ కేకలు వేసుకుంటూ బయటకు వచ్చేసింది. స్థానికులు వచ్చి చూసేసరికి గ్యాస్ స్టౌ నుంచి వ్యాపించిన మంటలతో ఇంట్లో సామాగ్రి దగ్ధమవుతున్నాయి. గ్యాస్ బండను స్థానికులు ఇంట్లోంచి బయటకు తరలించారు. అప్పటికే ఇంట్లో ఉన్న దుస్తులు టీవీ, ఫ్రిజ్ ఇతర నిత్యవసర సామాగ్రి కళ్ల ముందే కాలిపోవడంతో బాధితురాలు భోరున విలపించింది. సర్వం కోల్పోయిన పాములమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తా మహేష్ మనో ధైర్యం కలిగించి తహసీల్దార్ పి, కనకరావుకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ అధికారులు వచ్చి అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత



ఆలయ బేడా మండపంలో సిద్ధం చేసిన సానలు

సింహాచలం: సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ఠ, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా సానలను ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పాయకరావుపేట: రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వేపోలీసు ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. గుల్లిపాడు సమీపాన బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఘటన జరిగిందన్నారు. మృతుడు వంగపువ్వు రంగు టీషర్టు, నిక్కరు ధరించి వున్నాడన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన వ్యక్తి

15 నుంచి ఫుట్‌బాల్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: మూడు దశాబ్దాల విరామం అనంతరం మరోసారి విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు విశాఖలో జరగనున్నాయి. ఈ ఆహ్వాన అలిండియా ఫుట్‌బాల్ ట్రోఫీలో 16 జట్లు నాలుగు పూల్స్‌లో రైల్వే స్టేడియం ఫుట్‌బాల్ మైదానం వేదికగా తలపడనున్నాయి. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు జట్ల షెడ్యూల్‌ను వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ప్రదర్శించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతాయన్నారు. 23న ఫైనల్ పోటీ ఉంటుందని.. విజేతకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50 వేల నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ సూపర్‌లీగ్ (పీఎఫ్‌ఎస్‌ఎల్) అధ్యక్షుడు దిలీప్‌వర్మ తెలిపారు. సునేబేడా, బ్లూస్టార్స్, మధ్య ప్రదేశ్, ఏపీ, చెన్నై, విశాఖ, హైదరాబాద్, సిటీఏఫ్‌సీ, నాగపూర్, శ్రీధర్ స్పోర్టింగ్, ఎస్‌ఎఫ్‌ఏ, కోల్‌కతా, ఎస్‌ఏటీ, బర్గా, చత్తీస్‌గఢ్, డైచిమన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడనున్నాయి.

భూసార పరీక్షలపై శిక్షణ

- నేల సారవంతమైతేనే అధిక దిగుబడులు
- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు

అనకాపల్లి రూరల్: వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయంలో బుధవారం భూసార పరీక్ష, శిక్షణ వారోత్సవాల కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బి. మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిలో రిసోర్స్‌పర్సన్ల ద్వారా ఆర్‌బీకే కేంద్రాల సిబ్బందికి ఈ శిక్షణ ఇస్తామని చెప్పారు. ఏప్రిల్, మే నెలల్లో ఆర్‌బీకే పరిధిలో మట్టి నమూనాలు సేకరించి, భూసారం పరీక్షిస్తామని చెప్పారు. అందులో పోషక లోపాలు ఉన్నట్టయితే అందుకు అనుగుణంగా రైతులకు సూచనలిచ్చి అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తామన్నారు. భూ శాస్త్రవేత్త శిరీష మట్టి నమూనాలు సేకరించడం, వాటిని తయారు చేసే పద్ధతి గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం (బీసీటీ) శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని నేలల



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

రకాలు, భౌతిక, రసాయన విధానాలు, భూమి సంరక్షణ విధానాల గురించి తెలిపారు. తుమ్మపాల గ్రామంలో 50 మంది రైతుల పొలాల్లో 50 మట్టి నమూనాలను ప్రత్యక్షంగా ఆర్‌బీకే రిసోర్స్‌పర్సన్ల ద్వారా సేకరించి ప్రయోగశాలకు పంపారు. ఇందులో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, ఏవోలు, 24 మండలాల ఆర్‌బీకే రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

పాయకరావుపేట: నామవరం గ్రామంలో జాతీయ రహదారి పై లారీ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్టు ఎడిషనల్ ఎస్.ఐ. సత్యనారాయణ తెలిపారు. నామవరం గ్రామానికి చెందిన ఇసరపు సూర్యారావు (81) రోడ్డు పక్కన వున్న టీ స్టాల్ వద్ద నిలుచుకుని ఉండగా తుని నుంచి నక్కపల్లి వైపు జాతీయ రహదారి పై అతివేగంగా ప్రయాణిస్తున్న లారీ కారును, కారు ముందు వున్న సూర్యారావును ఢీ కొట్టింది. సూర్యారావు లారీ చక్రం క్రింద పడిపోవడంతో తలభాగం పూర్తిగా నలిగిపోయి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు ఇసరపు తాతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

బైకు అదుపు తప్పి బీటెక్ విద్యార్థి దుర్మరణం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో బుధవారం అర్ధరాత్రి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలంలోని అడ్డసార శివారు మర్రిపాలెం గ్రామానికి చెందిన కూరాకుల చిన్నబ్బాయి చిన్న కుమారుడు నాని(21)తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు.



గాయాలయిన సీతారామయ్య

సెలవులకు ఇంటికి వచ్చిన అతడు బుధవారం రాత్రి బైక్‌పై తగరపువలసలోని కళాశాలకు తిరిగి వెళ్తున్నాడు. ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ బలంగా ఢీకొనడంతో హెల్మెట్ నుజ్జునుజ్జు అయి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంధువుల ఇంటికి వెళ్లి వస్తూ...

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. టౌన్ సీఐ గణేష్ అందించిన వివరాలు...నర్సీపట్నం



లగిశెట్టిపాలెం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మృతిచెందిన నాని

శివపురంకు చెందిన కె.వెంకటనాయుడు(27) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల క్రితం నర్సీపట్నం వచ్చాడు. ఈ నెల 11వ తేదీన నర్సీపట్నం మండలం మెట్టపాలెంలో జరిగిన పండగకు బంధువుల ఇంటికి వెళ్ళాడు. అదే రోజు రాత్రి ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా బలిఘట్టం వద్ద పంది అడ్డురావడంతో తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్దండపురం వద్ద ..

నక్కపల్లి: జాతీయరహదారిపై బుధవారం ఉద్దండపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన రాము బైకుపై వెళ్తుండగా వెనుక నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రాము కాలు విరిగింది. ఇదే కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. ముందు కారులో కూర్చున్న విశాఖపట్నంకు చెందిన సీతారామయ్యకు గాయాలయ్యాయి. వారిని తుని ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై నాయకుల ప్రచారం



జమాదులపాలెంలో ఇంటింటికీ కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మూడో రోజూ భానుడి ప్రతాపం

కశింకోట: మండలంలో వరుసగా మూడో రోజు బుధవారం కూడా భానుడి ప్రతాపం తగ్గలేదు. ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదు అయింది. ఉదయం నుంచి ఎండ వేడిమి ప్రారంభమై సాయంత్రం వరకు కొన సాగింది. ప్రజలు బయట తిరగడానికి భయపడ్డారు. అత్యవసర పని ఉంటే తప్ప బయటికి వెళ్లలేదు. ఒక వైపు ఉక్కపోత, మరో వైపు వేడితో వృద్ధులు, పిల్లలు సతమతమయ్యారు. గురువారం ఇంకా ఉష్ణోగ్రత పెరగగలదని, 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉంటుందని సమాచారం.

ఉత్తమ ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించాలి



కేరింతల్లో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: మంచి ప్యాకేజీతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో బుధవారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థుల వీడ్కోల సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం మాట్లాడుతూ నూతన టెక్నాలజీలని ఉపయోగించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఎస్‌ఈ విభాగాధిపతి సుజాత, వివిధ విభాగాల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మీటర్	రాజా
రంగమార్తాండ	సత్యనారాయణ స్క్రీన్-1
డంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
దసరా	పర్తిసాయి
భూతవైద్యుడు(ది పోప్స్ ఎగ్జార్సిస్ట్)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 3,880 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,130	4,190
మొదటి రకం	3,950	4,060
రెండో రకం	3,420	3,940
మూడో రకం	3,250	3,400

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 92 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ'పాజిటివ్-5 యూనిట్లు, 'ఎ'నెగెటివ్-1 యూనిట్, 'బి'పాజిటివ్-39 యూనిట్లు, 'ఒ'పాజిటివ్ 47 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

కోరినంత పని.. గిట్టుబాటు కూలి



కన్నూరుపాలెంలో సాగునీటి చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు



విస్సన్నపేటలో వర్షపు నీటి నిల్వకు కందకాలు తవ్వుతున్న కూలీలు

- ఉపాధి పనులతో కూలీల సంబరం
- వారానికి ఒకసారి చెల్లింపులు

కశింకోట: మండలంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రూ. కోటి 70 లక్షల మేర ఉపాధి పనులు చేపట్టి నిర్వహిస్తున్నారు. రోజుకి నాలుగు వేల మందికి పైగా కూలీలు పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కూలీలకు వారానికి ఒకసారి చెల్లింపులు జరుపుతున్నారు. సాగునీటి చెరువుల్లో పూడిక తీతకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి పనులు నిర్వహిస్తున్నారు. 9 సాగునీటి చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టారు. వీటితోపాటు కందకాల తవ్వకాలు, వరద నివారణ గట్ల నిర్మాణం తదితర పనులు నిర్వహిస్తున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలున్నాయి. మట్టి పనుల నిర్వహణకు వేసవి అనుకూలం కావడంతో ఆయా పంచాయతీల పరిధిలో ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులు చేపట్టారు. ప్రధానంగా కన్నూరుపాలెం, అడ్డాం, సుందరయ్యపేట, తీడ, చెరకాం, బయ్యవరం గ్రామాల్లో సాగునీటి చెరువుల్లో పూడిక తీతలు చేపట్టారు. అడ్డాంలో నాలుగు చెరువులు, మిగిలిన గ్రామాల్లో ఒక్కొక్క చెరువు వంతున



చెరువులో పూడికతీత పనులకు వస్తున్న కూలీలు

పనులు జరుగుతున్నాయి. వీటి కింద ఒక్కొక్క దానికి 50 నుంచి 150 ఎకరాల వరకు ఆయకట్టు భూములు ఉన్నాయి. పూడికతీత పనులు పూర్తి అయితే పంట భూములకు సమృద్ధిగా సాగునీరు అందగలదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కశింకోట, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో ఆరుచోట్ల వర్షపు నీటి వల్ల వరద నివారణ గట్ల ఏర్పాటు, వర్షపు నీటిని నిల్వ ఉంచడానికి విసన్నపేట తదితర గ్రామాల్లో కొండలపై కందకాల తవ్వకాలు, తదితర పనులు నిర్వహిస్తున్నారు. వారానికి రూ.18 లక్షల వరకు చెల్లింపులు జరుగుతున్నట్లు అధికారిక సమాచారం. కూలీ ఒక్కొక్కరికి రోజుకి రూ.260 వంతున ఇస్తున్నారు. పక్క గ్రామానికి పనికి వెళితే ప్రయాణ అలవెన్స్ రూ.15 చెల్లిస్తుండటం, వారానికి ఒకసారి చెల్లింపులతో కూలీలు ఉత్సాహంగా పనులకు హాజరవుతున్నారు. ఇంకా ఉపాధి కూలీలు ఎంతమంది వచ్చినా కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తామని అధికారులంటున్నారు. ఇంకా రెండు వేల పైబడి కూలీలకు డిమాండ్ ఉందంటున్నారు.అయితే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, ఇతరులు ఉపాధి పనులకు రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఎంపీడీవో, ఉపాధి పథకం ప్రోగ్రాం అధికారి కొంకి అప్పారావు, ఉపాధి పథకం ఏపీవో శివ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

కూలి గిట్టుబాటు అవుతోంది

ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతుండటం వల్ల కూలి లభిస్తోంది. మా గ్రామంలో పనులు లేక పక్కనున్న అడ్డాం గ్రామానికి చెరువుల్లో పూడికతీత పనులకు వెళుతున్నాం. వారానికి ఒకసారి చెల్లింపులు జరుపుతున్నారు. రోజుకి రూ.260 వరకు కూలీ గిట్టుబాటు అవుతోంది. అలాగే ఎంత మంది వస్తే అంత మందికి పని దొరుకుతుందని అధికారులు తెలిపారు. పక్క గ్రామానికి పనికి వెళితే అలవెన్స్‌గా రూ. 15 ఇస్తున్నారు.

–ద్వారపురెడ్డి రామంజి, ఉపాధి కూలీ, జి.భీమవరం గ్రామం

మజ్జిగ సరఫరా చేస్తే ఉపశమనంగా ఉంటుంది



అడ్డాంలో నాలుగు చెరువుల పూడికతీత పనులు జరుగుతున్నాయి. రోజూ వెళుతున్నాం. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. దీనివల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. మజ్జిగ సరఫరా చేస్తే ఉపశమనంగా ఉండగలదు.

–బత్తిన గణేష్, ఉపాధి కూలీ, జి. భీమవరం గ్రామం

ఎంత మంది వచ్చినా పని కల్పిస్తాం



మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో రూ.కోటి 70 లక్షలతో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజుకి 4018 మంది కూలీలు పని చేస్తున్నారు. ఇంకా ఉపాధి కూలీలు ఎంత మంది వచ్చినా వారికీ పని కల్పించి కుటుంబానికి వంద రోజులు కూలీ కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం. లక్ష్యం మేరకు ఉపాధి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

–కొంకి అప్పారావు, ఎంపీడీవో, ఉపాధి పథకం ప్రోగ్రాం అధికారి, కశింకోట.

నాణ్యత లోపిస్తే సహించేది లేదు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు ఎర్రచెరువు చుట్టూ నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ పనులను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని అధికారులను ఆదేశించారు. చిన్నారులు, పెద్దలకు ట్రాక్ సమీపంలో పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అంతకు ముందు ట్రాక్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల అమరిక పనులు చేపట్టాలి

కశింకోట: సమగ్ర భూముల రీ–సర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఉపాధి కూలీలను వినియోగించి సర్వే రాళ్ల అమరిక పనులను ప్రణాళిక ప్రకారం నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి ఆదేశించారు. కశింకోటలో బుధవారం సాయంత్రం అధికారులతో సర్వే రాళ్ల అమరికపై సమావేశం నిర్వహించారు.

ఉపాధి కూలీల ద్వారా రోజుకి వెయ్యి సర్వే రాళ్లు అమర్చాలని కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రీ–సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సోమవరం, జెట్టపురెడ్డితుని, గొబ్బూరు, తేగాడల్లో గూగుల్ మ్యాప్ ఆధారంగా నిర్దేశిత ప్రాంతాలను గుర్తించి భూములకు సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, ఉపాధి పథకం ఏపీవో శివ, మండల సర్వేయర్ ధనుంజయ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన పాలక వర్గం సభ్యులు



కొత్త కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

కశింకోట: మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షునిగా గోకివాడ సూరిబాబు, ఉపాధ్యక్షునిగా నైదాన రాజులు, కార్యదర్శిగా గోకివాడ రాజులు, పాలక వర్గ సభ్యులుగా గోకివాడ అప్పలనాయుడు, దాలిబోయిన రమణ, సారిపల్లి సత్యారావు ఎన్నికయ్యారు. కశింకోట పశు వైద్యాధికారి అల్ఫాన్సా జార్జి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వీరిని మోసయ్యపేట సర్పంచ్ మిస్కా రాజేశ్వరి, ఉప సర్పంచ్ గోకివాడ గోవింద తదితరులు అభినందించారు.

కూండ్రంలో..

అనకాపల్లి రూరల్: మండలంలోని కూండ్రం గ్రామంలో బుధవారం పరమటమ్మ గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సేవా సంఘం ఎన్నికలు జరిగాయి. అనకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నియోజకవర్గం పరిధిలో అన్ని గ్రామాల్లో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. జూనియర్ వెటర్నరీ అధికారి సీహెచ్ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. 60 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన కొత్త కార్యవర్గం నూతన అధ్యక్షుడిగా కోన ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పల్లా తాత, కార్యదర్శిగా వారధి శ్రీను, డైరెక్టర్లుగా మొల్లి రాజు, యలమంచిలి నాగరాజు, మొల్లి ఫాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

మంచి మాత్రమే శాశ్వతం

అనకాపల్లిటౌన్: ప్రపంచంలో మనం చేసే మంచి మాత్రమే శాశ్వతమని శివలీల అక్కయ్య అన్నారు. స్థానిక ఓం శాంతి భవనంలో బుధవారం జరిగిన ఆధ్యాత్మిక ప్రార్థనలో ఆమె మాట్లాడారు. చెడు చెద్దామనే భావన కాకుండా మంచి చేయాలనే తపన ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓం శాంతి విద్యా అక్కయ్య, పూర్ణిమ అక్కయ్య, ఓం శాంతి భక్తులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రార్థనలో శివలీల అక్కయ్య

ఇంటింటి కుళాయి పనులకు శ్రీకారం

చీడికాడ : మండల కేంద్రం చీడికాడలో రూ.2 కోట్లతో ప్రతిపాదించిన ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులకు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ చీడికాడ ప్రజల తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పరవాడ మహేష్, ఈర్లె చైతన్య, పరువాడ అప్పారావు, శిరిశోల్ల మహేష్, సిమ్మెంట్ నాయుడు, పరువాడ రామారావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో ఉపశమనం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిమోతి

అనకాపల్లిటౌన్: వేసవిలో పాదచారులకు చలివేంద్రాలు ఉపకరిస్తాయని ఫాస్టర్ పద్రాన తిమోతి అన్నారు. కరుణామయుడు ఎంటర్‌ప్రైజెస్ శాఖ వీధి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. వేసవితాపం ఎక్కువవుతున్న నేపథ్యంలో ఇటువంటి చలివేంద్రాలు పాదచారులకు గుక్కెడు నీరందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శాఖవీధి సభ్యులు ఎస్.రామారావు, ఇంజరపు వెంకటరావు, తాకాశి వెంకటేశ్వరరావు, పంపాన సత్తిబాబు, ఈశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంకు వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: జాతీయ బ్యాంకుల్లో రెండో స్థానంలో నిలిచిన పంజాబ్ నేషనల్ బ్యాంకు 129వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం బ్యాంకు ఆవరణలో జరిగాయి. మేనేజర్ జీఆర్ఎల్ శర్మ స్థానిక రింగ్ రోడ్డు బ్యాంకులో కేక్ కట్ చేసి ఖాతాదారులకు పంపిణీ చేశారు. స్వాతంత్ర సమరయోధులు లజపతి రాయ్ చేతుల మీదుగా బ్యాంకు ప్రారంభమైందన్నారు. అంతకు ముందు ఖాతాదారులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందిస్తున్న సర్పంచ్ దారా మల్లేశ్వరిచిన్ని

మాడుగుల : మండలంలో జాలంపల్లి పంచాయతీ ఎల్.కొత్తపల్లి గ్రామానికి చెందిన డోకుల దేముడు ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని భార్య రమణమ్మకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదు అందించారు. మిగిలిన రూ.90 వేలు బ్యాంక్ ఖాతాకు జమవుతాయని సర్పంచ్ దారా మల్లేశ్వరి చిన్ని తెలిపారు. సర్పంచ్ వెంట సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు పావలా వడ్డీ నగదు పంపిణీ



రైతులకు పావలా వడ్డీ చెక్కులను అందిస్తున్న గోవింద్

బుచ్చెయ్యపేట : రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులంతా రుణపడి ఉంటామని విజయరామరాజుపేట కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎల్లపు గోవింద అన్నారు. బుధవారం విజయరామరాజుపేట సొసైటీలో మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట గ్రామాలకు చెందిన 584 మంది రైతులకు పావలా వడ్డీ రాయితీ రూ.7,34,645 చెక్కును అందించారు. గతంలో బ్యాంక్ ద్వారా రుణం తీసుకుని, అసలు, వడ్డీ చెల్లించిన రైతులకు ప్రభుత్వం తిరిగి పావలా వడ్డీ నగదును చెల్లించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సొసైటీ ద్వారా అందిస్తున్న రుణ సౌకర్యాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కంటే రామక్రిష్ణ, పెంటకోట క్రిష్ణ, సెక్రటరీ బొడ్డేటి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు'



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం వేదికగా మారిందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో కొత్తూరు సచివాలయం–2 పరిధిలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలపై ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలనే సాధ్యపడుతుందన్నారు. అంతకు ముందు మహిళలు మంత్రి అమర్‌నాథ్‌కు హారతులు పట్టి నీరజనాలు పలికారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ప్రజలకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వెంకట వరహా సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శారదా కాలనీలో..

స్థానిక శారదాకాలనీ 14 సచివాలయ పరిధిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఇంటింటికి వెళ్లి జగనన్న అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీసి ఇంటి యజమాని అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గైపూరి రాజు, సురేష్, అప్పారావు, సంతోష్, లక్ష్మి పాల్గొన్నారు.

మహావీరుని కృషి నిరుపమానం



విద్యార్థులకు మహావీరుని పుస్తకాలు అందజేస్తున్న నాగభూషణం

అనకాపల్లిటౌన్: భగవాన్ మహావీరుని 2599వ జయంతి వేడుకలు సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గొల్లవిల్లి ప్రైమరీ స్కూల్లో బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మహావీరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైనమత స్థాపకులు భగవాన్ మహావీరుని జయంతి వేడుకలు నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. సమాజంలో శాంతి, అహింసలు పెంచేందుకు చేసిన ఆయన కృషిని కొనియాడారు. అంతకు ముందు విద్యార్థులకు మహావీరుని పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అల్లాడ శ్రీనివాసరావు, పట్నాల కృష్ణమోహన్, వినకోట నీలేష్‌గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



బస్సులను ప్రారంభిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: వేసవిలో పుణ్యక్షేత్రాలకెళ్లే మహిళా భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఉచితంగా నడుపుతున్నట్టు వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం తీర్థయాత్రకు రెండు బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహాలక్ష్మి దేవాలయాల దర్శనార్థం ఈ బస్సులను భక్తులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం కల్పిస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాయుడుపేట శ్మశానవాటికకు మరమ్మతులు



రాయుడుపేట శ్మశానవాటికను చదును చేయిస్తున్న స్థానికులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం బట్లపూడి పంచాయతీ రాయుడుపేట శ్మశానవాటిక స్థలాన్ని స్థానికులు చదును చేయించుకున్నారు. జాతీయ రహదారి విస్తరణలో కొంత మేర శ్మశానవాటిక రోడ్డులో పోయిందని, మిగిలిన శ్మశానవాటికను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో స్థానికులు చందాలు వేసుకుని బుధవారం జేసీబీతో చదును చేయించుకున్నారు. గ్రామంలో వర్షం, వరదలు వచ్చినప్పుడు శ్మశానవాటిక మీదుగా ఏలేరు కాలువలోకి నీరు పారుతుందని ఆ మార్గాన్ని శుభ్రం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, జి.సత్యనారాయణ, అనపూరి అప్పారావు, ఇల్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు యువత ముందుకు రావాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ సునీత

అనకాపల్లిటౌన్: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీనగరంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారికి ఇటువంటి చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. యువత చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యంతో ఆడపెయ్యిలు



రైతులకు సూపర్ నేపియర్ గడ్డి గురించి వివరిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి

కె.కోటపాడు : ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భోత్పత్తిలో లింగ నిర్ధారిత వీర్యం ఇవ్వడం ద్వారా ఆడపెయ్యిలు జన్మించేటట్టు చేయవచ్చని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. మండలంలోని సింగన్నదొరపాలెంలో పాడి రైతులకు బుధవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా పాడి పెంపకంలో జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఆడపెయ్యల ఉత్పత్తికి సంబంధించిన వీర్యంను ఎదకు వచ్చిన పశువులకు వేయించుకోవచ్చన్నారు. అదే విధంగా కాకిజొన్న, సూపర్‌నేపియర్ గడ్డిని పశువులకు వేసవిలో మేతగా ఇవ్వాలని రైతులకు సూచించారు. ఈ గడ్డిని తినేందుకు పశువులు ఇష్టపడటంతోపాటు, ఆరోగ్యంగా ఉండి, పాల దిగుబడి మెరుగ్గా ఉంటుందన్నారు. పశువులను వేసవిలో రెండు పూటలా నీటితో శుభ్రం చేయాలని సూచించారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత పశువులను మేతకు బయటకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్బీకే పశువైద్య సహాయకుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.